# యిరవై ఏళ్ళ క్రిందట...



= రచన : శ్రీ రాధారమణ =

శ్రీవారి పాద పద్మములకు...

నమస్కారములు. మీరు వ్రాసిన రెండు కవర్లు, నాలుగు కార్డులు, మూడు టెలిగ్రామ్‌లు అందాయి. అనివార్య కారణాలవల్ల వెంటనే జవాబు రాయలేక పోయాను. ఇప్పుడు కొంచెం బాగుంది వంట్లో. అందుకే వెంటనే రాస్తున్నాను. చదివి గాభరాపడి పరుగెత్తుకు రాకండి. వారంరోజుల్లో వచ్చేస్తాను.

ఓ వింతసంఘటన జరిగింది. తలచుకొంటే యిప్పటికీ గుండె ఝల్లుమంటూంది. పదిహేను రోజుల క్రిందట మా స్నేహితులంతా కలిసి యిక్కడికి ఏభై మైళ్ళ దూరంలోవున్న చరిత్ర శిథిలాన్ని చూడ్డానికి పిక్‌నిక్‌కి వెళ్ళాం. పదిహేనువందల సంవత్సరాల నాటివి అవి. ఆహ్లాదకరమైన ఆ ప్రదేశంలో రోజంతా గడిపాం. మరో మూడు మైళ్ళు వెడితే అక్కడ పెద్ద సొరంగ మార్గం వుందని, అందులో కొంతదూరం వెడితే పెద్ద మండపంలో ఓ భూగృహముందని అక్కడి గైడ్ చెప్పాడు. ఆమెను అదికూడా చూపమన్నాం. కానీ సాయంత్రమైందని, మర్నాడు రండని, అందామె. నాకు వాటిని చూడాలన్న ఆతృత అధికమైంది.

అంతా రెస్టుహౌసు చేరుకొన్నాక, కనీసం సొరంగ మార్గం వరకయినా వెళ్ళివద్దామని బయలుదేరాను— ఒంటరిగా.

సుమారు ఓ మైలుదూరం నడిచేసరికి ఓ యువతి ఎదురయింది. అక్కడినుండీ మూడు త్రోవలున్నాయి. ఎటు వెళ్ళాలో తెలీక ఆమెను అడిగాను.

'మీరెవరు?' అందామె వింతగా చూస్తూ.

'మేం ఇక్కడి శిథిలాల్ని చూడ్డానికొచ్చాం. ఇక్కడేవో కేవ్స్ ఉన్నాయట. చూదామని బయలుదేరాను' అన్నాను.

'బాగుంది. యిప్పుడా? చీకటైపోతోంది. ఈ రాత్రి బంగళాకి రండి. రేపు ఉదయం మీకంతా చూపిస్తాను' అందామె చిత్రంగా నవ్వుతూ.

'లేదండీ. మావాళ్ళు ఎదురుచూస్తూ వుంటారు. ఉదయమే వస్తాను' అన్నాను.

'ఫరవాలేదు. మీకు అన్ని సదుపాయాలు వున్నాయి ఇవాళ మా బెంజిమెన్ లేడీకి గెస్టులుగా వుండండి. ఆమె చాలా మంచివారు. పెద్ద లంకంత యిల్లు. ఆమె, నేనూమాత్రమే వుంటున్నాం. ఆమె చాలా సరదా ఐన వ్యక్తి. రాత్రికి మీకు మంచి కాలక్షేపంగా వుంటుంది— రండి' అందామె.

'మీ పేరేమిటి? ఆమెకూ మీకూ సంబంధమేమిటి? అన్నాను ఆమె ప్రక్కగా నడుస్తూ.

'నా పేరు శ్యామసుందరి. బెంజిమెన్ లేడీకి సెక్రెటరీగా పనిచేస్తున్నాను. నా మకాంకూడా అక్కడే. ఆమె మంచి స్థితిపరురాలు. పెద్ద ఆస్థి, ఎస్టేటు, లంకంత యింటికి ఆమె ఏకైక వారసురాలు,' అంది శ్యామసుందరి.

ఆమె నన్ను మరో మైలు నడిపించి లోయలాంటి ప్రదేశంలో చుట్టూ పెద్ద ప్రహరీగోడ, మధ్యగానున్న పురాతన భవనం దగ్గరికి తీసుకెళ్ళింది.

అప్పటికి తదియ చంద్రుడు పైకొచ్చాడు. వెన్నెల కాంతిలో వింతగా కనిపిస్తోంది ఆ ప్రదేశం.

'ఇంత నిర్మానుష్యంగా ఉందేమిటి ఈ భవనం? కరెంటు లేదా?' అన్నాను.

'ఊరికి దూరంగా వున్నందువల్ల ప్రత్యేకించి ఈ భవనానికి మూడు మైళ్ళదూరం కరెంట్‌లైన్ యివ్వడం యెందుకని ఊరుకున్నాం. అయినా ఆ లోటు లేదులెండి. దీపాలు వున్నయ్.' అంది సుందరి ముఖద్వారంతలుపులు తెరుస్తూ.

సుమారు పదడుగుల ఎత్తు, ఆరడుగుల వెడల్పు గల పెద్ద ద్వారమది. తలుపులమీద—మన తెలుగు దేవాలయాల్లో వున్నట్లు ఏవేవో బొమ్మలు నగిషీలు చెక్కబడి వున్నాయి.

చిన్న శబ్దం చేస్తూ తెరచుకొన్న తలుపులు దాటి లోపలికి అడుగుపెట్టాం.

పెద్ద హాలు మధ్యగా ఓ సోఫాసెట్టు, ఓ టీపాయ్, వాటి వెనుక పైకి వెళ్ళడానికి మెట్లు, నేలమీద రంగు రంగుల తివాసీ—గమ్మత్తుగ ఉందా హాలు.

చుట్టూ నాలుగు పెద్ద చిమ్నీ దీపాలు వెలుగుతున్నాయి గాలికి నాట్యం చేస్తూ.

వాటి వెలుతురు ఆ హాల్లో గూడుకట్టుకొన్న చిక్కటి చీకటిని సంతృప్తిపరచలేక పోతున్నాయి.

'అలా ఆ సోఫాలో కూర్చోండి. ఇప్పుడే వస్తా' అంటూ ఎడమవైపున వున్న ద్వారంగుండా లోపలికి పోయింది సుందరి. ఆ గుమ్మానికి సిల్కు తెరలు వేలాడుతున్నాయి. గాలికి ఆ తెరలు పైకిలేచి ప్రక్కన స్టూలు మీద పెట్టిన చిమ్నీ దీపాలవరకూ వచ్చి వెనక్కి పడుతున్నాయి.

అదేమిటి? అలా అశ్రద్ధగా వూరుకున్నారు? ఆ కర్టెన్లు లైటుమీద పడి అంటుకుంటే—యింకేమయినా వుందా? అంతలో సుందరి ఓ ట్రేలో రెండు గ్లాసులు నిండుగ పాలూ, రెండు ప్లేట్లలో బిస్కట్లు పట్టుకొని నా ప్రక్కనుండి వెళ్ళి మెట్లు ఎక్కసాగింది.

'ఎక్కడికి వెళుతోందామె? యజమానురాలికా తీసుకెళుతోంది? ఆమె క్రిందకు ఎందుకు రాలేదు? ఏమిటో నాకేం అంతుపట్టలేదు. సుందరి వెళ్ళినవైపే చూస్తూ కూర్చున్నాను.

—అయిదు, పది, పదిహేను నిమిషాలైనా ఆమె రాలేదు. నాకు విసుగనిపించింది. ఎవరో ముక్కూ మొహం తెలియనివాళ్ళు పిలిస్తే వచ్చేయడమేనా? ఈ రాత్రంతా యిక్కడెలా వుండటం? పైకి వెళ్ళి ఆమెకు చెప్పి వెళ్ళిపోతే మంచిదేమో—

అనుకొని లేవబోయాను.

అదే సమయంలో హఠాత్తుగ పైనుండి పెద్ద మంటలు పొగ కమ్ముకున్నాయి. ధన్...ధన్ మంటూ ఏవో పడిపోతూన్నట్లు శబ్దమైంది. నేననుకొన్నట్లే అయింది. అజాగ్రత్తగ పెట్టిన ఆ లైట్లవల్ల యిలాంటి ప్రమాదం


MOTORS SEI PUMPS





- Excellant Performance.
- Low Current Consumption.
- Long Life

OUR RANGE OF PRODUCTS

- Electric Motors, Single Phase ¼ H.P. to 2 H P. 3 Phase ½ H. P. to 20 H.P.
- Centrifugal Pumps
- Domestic Pumps
- Monoblock Sets (3 H P. to 10 H. P.)

*MANUFACTURERS*

SOUTHERN ENGINEERING INDUSTRIALS.

343, AVANASHI ROAD : : COIMBATORE-18.

*Branch :* 30, THAMBU CHETTY STREET, MADRAS-1

యెప్పుడో జరుగుతుందని అనుకుంటూనే వున్నాను. గబగబా మెట్లెక్కి పైకి పరుగెత్తాను. చూస్తుండగానే మంటలు విజృంభించి కర్టెన్‌లు అన్నీ అంటుకున్నాయి. నల్లని పొగ యిల్లంతా చుట్టుముట్టింది. లోపలివాళ్ళు ఏమైనారో? ఏవో పడిపోతున్నట్లు, దొర్లిపోతున్నట్లు చప్పుళ్ళు వినిపిస్తున్నాయి.

క్రమంగా పరిసరాల్ని గుర్తించడానికి వీల్లేకుండా అల్లుకున్నాయి మంటలు. పొగ కళ్ళల్లోకి దూరి విపరీతంగా మండసాగాయి కళ్ళు.

నేరకపోయి దిగబడ్డాను యీ రొంపిలో. ఈ ప్రమాదంనుండి ఎలా బయటపడ్డం?

ద్వారం ఎటుందోకూడా తెలియడం లేదే. వాళ్లిద్దరు ఏమైనారో?

'సుందరీ' అంటూ గట్టిగా పిలిచి, నాలుగడుగులు ముందుకు వేశాను—అంతే—కాలుజారి మెట్లమీంచి దొర్లుతూ క్రింద పడ్డాను.

నా అదృష్టం బాగుండి దెబ్బలేమీ తగులకుండానే లేవగలిగాను. పొగలో ఎదురుగానున్న దృశ్యం కనిపించడం లేదు.

మంటల వేడి చెంపల్ని చురికిస్తోంది. క్రిందనున్న వస్తువుల్నికూడా తాకాయి మంటలు. అంతా సర్వనాశనమౌతోంది. వాళ్ళిద్దరూ ఏమైనారో? గొంతు చించుకుని అరిచాను వారిద్దరికోసం.

జవాబు రాకపోయేసరికి భయంతో గుండెలు దడదడలాడాయి. వాళ్లు ఆ మంటలకి ఆహుతైపోయారా? నాకు కూడా అదేగతి...అమ్మయ్యో...అజాగ్రత్తగా ఉన్నందువల్ల పైటచెంగు అంటుకుంది. వణికిపోతూ వెంటనే చేత్తో ఆర్పి, నడుంచుట్టూ తిప్పి మొల్లో దోపుకున్నాను. చీరకుచ్చెళ్ళు ఎత్తిపట్టుకొని సత్తువకొద్దీ పరుగెత్తాను. అంతే—ముఖద్వారం దాటుతూండగా మిన్ను విరిగి మీదపడినంత శబ్దమైంది. తుళ్ళిపడ్డాను ముందుకి. తరవాత ఏమైందో?

కళ్ళు తెరిచేసరికి ఎదురుగా ఓ యువకుడు నిలబడి వున్నాడు. ముఖంమీద కాలినమచ్చలు తెల్లగా కన్పిస్తున్నయ్. ఎందువల్లో తలమీద అక్కడక్కడ మాత్రం జుత్తువుంది. మెళ్ళో స్టెతస్కోపు. నావైపే చూస్తున్నాడు ఎర్రని కళ్ళతో.

వళ్ళంతా నొప్పిగావుంది. నుదురు, చెంపలు మండుతున్నయ్.

'వాళ్ళిద్దరూ బ్రతికారా?' అన్నాను అతనితో.

'ఎవరిద్దరూ?' సన్నని కంఠంతో అడిగాడతను వింతగా చూస్తూ.

'ఆ యింట్లోవుండే శ్యామసుందరి, బెంజిమెన్ లేడీ.'

'వాళ్ళు చనిపోయి యిరవై ఏళ్లయింది.'

'ఆఁ!! మీకు మతిపోయిందేమిటి? నిన్న ఆవిడతో వాళ్ళింటికి వెళ్ళాను. రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. వాళ్లిద్దరూ మేడమీద ఉండిపోయారు. నేను క్రిందనుండి పైకి వెళ్ళేసరికి మంటలు అధికమయ్యాయి. నన్ను నేను రక్షించుకొనేందుకు క్రిందకి పరుగెత్తి పడిపోయాను తరవాత ఏమైందో—ఇక్కడున్నాను. మీరు ఆ యింట్లో వెదకలేదా?' అన్నాను.

'మీరు పొరబడుతున్నారు మేడమ్. మీరు చెప్పింది అంతా నిజమే. అయితే ఇది జరిగి ఇరవైయేళ్లయింది. ఆ భవనంలో బెంజిమెన్ లేడీ ఉండేది. ఆవిడకి కావలసినంత ఆస్తి ఉంది. ఆమె తదనంతరం ఆ ఆస్తికి ఏకైక వారసురాలు ఆమె సెక్రటరీ సుందరి. ఆమెకు ఓ ప్రియుడుండేవాడు. ఒకనాడు సుందరి, ఆమెప్రియుడు బాగా ఆలోచించి ఓ ప్లాను వేశారు. ఆ ప్లాను ప్రకారం ఆరోజు రెండుగ్లాసులతో పాలుతీసుకెళ్ళి, బెంజిమెన్ లేడీ ఎదురుగా ఒకగ్లాసు వుంచి, తనముందు ఒక గ్లాసు ఉంచుకొంది.

అలా ప్రత్యేకించి గ్లాసులు ఉంచడానికి కారణం వేరే ఉంది. సుందరి బెంజిమెన్ లేడీ గ్లాసులో సైనేడ్ కలిపింది. ఆమె ఆ పాలుత్రాగి చనిపోగానే, కర్టెన్‌లకి నిప్పంటించి అగ్నిప్రమాదం సృష్టించి, ప్రమాదవశాత్తు యజమానురాలు మరణించినట్లు చేద్దామని. అయితే ఆనాడు సుందరి చర్యలు వింతగా కనబడ్డాయి. రోజూ రెండుగ్లాసులు ట్రేతో తెచ్చి టేబుల్ మీద ఉంచి, చెరోపాటి తీసుకొనేవాళ్ళు, యివాళ ప్రత్యేకించివుంచడంతో ఆమెకు అనుమానం వేసి, ఆ ఎదురుగానున్న కర్టెన్ను తొలగించమని చెప్పి, సుందరి అటువెళ్లగానే తను గ్లాసులు మార్చేసింది.

పాపం సుందరి తిరిగొచ్చి ఆ పాలుత్రాగి వెంటనే

నేలకూలింది. అసలు రహస్యం బయటపడ్డంతో బెంజిమెన్ లేడీ నవ్వుతూ లేచి నిలబడింది.


'హుః! యిన్నాళ్లు నిన్ను ఆదరించి, ఆస్తి అప్పగిద్దామనుకున్నందుకు యిదా నీ ప్రతిఫలం? ఇంతనీచత్వాన్ని తలపెడతా వనుకోలేదు'___ఆమె విసురుగా లేవడంతో ప్రక్కన ప్రమాదం సృష్టించడానికి సుందరి యేర్పాటు చేసిన లైటు తిరగబడి గాజుదీపం బ్రద్దలై ఆయిలు గదంతా చిమ్మింది. వెంటనే ఆ ప్రదేశమంతా మంటలు ప్రాకిపోయాయి. ఎలాంటి ప్రమాదం సుందరి తలపెట్టిందో అదే జరిగిపోయింది. వారిద్దరి చావుతోపాటు అంతా సర్వనాశనమైంది. ఇదిజరిగి సరిగ్గా నేటికి ఇరవై ఏళ్లయింది. ఆ శిధిలాల్లో మీరు స్పృహతప్పి పడి వున్నారు. చిన్నదెబ్బలు తగిలాయి అంతే. ప్రమాదం లేదు' అన్నాడతను.

'ఇదంతా మీకెలా తెలుసు?' ఆశ్చర్యంగా అడిగాను.

'ఆనాడు ప్రమాదం జరిగే సమయంలో నేనూ అక్కడే వున్నాను. సుందరికి సైనేడ్ యిచ్చింది నేనే సుందరిని ప్రేమించింది నేనే' అన్నాడతను.

'అయితే...మరి...మరి...' నా నోట్లోని మాట పైకి రాకుండానే డాక్టర్ రూపం నా కళ్లముందు కరిగిపోయింది.

'అయ్యో రాధా! ఈ శిధిలాల్లో పడిపోయావా? దెబ్బలు తగలేదుకద...రాత్రినుండ నీకోసం వెదుకుతున్నాం' అంటూ నా స్నేహితురాళ్లంతా చుట్టుముట్టారు. చుట్టూచూసి త్రుళ్ళిపడ్డాను ... నాడు శిధిలమైపోయిన రాళ్లకుప్పల మధ్య పడివున్నాను.



మా శ్రేయోభిలాషులకు
దీపావళి శుభాకాంక్షలు

## నేటి రచయితలు

నిజమాడితే నిష్టూరం. 'కవులకు సన్మానం చేసే రోజులు పోయాయి - పాఠకులకు సన్మానం చేయాలి' అంటాడో మిత్రుడు.

అదీ నిజమే ననిపిస్తోంది, రోజులు గడిచిన కొద్దీ.

హైస్కూలు విద్యార్థి ఆఫీసు గుమాస్తా కాఫీ హోటల్ సర్వరూ తెలుగు పూర్తిగా రాని శ్రీమతీ అందరూ కవులే, అంతా రచయితలే.

ప్రముఖ బెంగాలీ రచయిత అనువాదాన్నే ఆధారంగా మళ్ళీ వ్రాస్తాడు భాషమార్చి ఒక రచయిత. ఆ అనువాదాన్నే చదివి తన భావాల్ని యిమిడ్చి కొత్త పుస్తకం వ్రాస్తుంది ఒక రచయిత్రి.

కొన్ని పుస్తకాలు చుట్టూ వేసుకొని తెల్లారేప్పటికొక పుస్తకం వ్రాస్తాడొక నవలా రచయిత.

పత్రికల్లోని రచనలు సంఘటనల్ని మార్చి మళ్ళీ వ్రాస్తారు కొందరు మిత్రులు. ఇకపోతే రచనలపై ఆధారపడి బ్రతికే రచయితలు సరేసరి!

ఏ పుస్తకం ఎంత డబ్బు సంపాదిస్తుందీ అంతే తప్ప రచనల ప్రాముఖ్యం ఎవరికాకాలి? పేజీకి రూపాయా లేక రెండా?

కారణం రచయితలని ఎట్లా చెప్పడం___ పట్టణం మారుమూల చీకటిగదిలో పాలు లేక ఏడ్చే పిల్లల ధ్య, బియ్యం అయిపోయాయనే శ్రీమతిగారి మాటల ధోరణిలో, వచ్చే పోయే బాకీలవాళ్ళ రొదల్లో, ఎంత మంచి కవి మాత్రం ఏం వ్రాయగలడు?

—"ఈశ్వర్"